క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



అవనిగడ్డ: స్థానిక ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం డీజీపీ ద్వారకా తిరుమలరావును ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. నాలుగేళ్ల క్రితం అవనిగడ్డలో జరిగిన డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసు దర్యాప్తు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరినట్టు చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ మచిలీపట్నం డివిజన్ ఈఈ ఎం.భాస్కరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఈడేపల్లి పంచాయతీరాజ్‌కాలనీ, నారాయణపురం, పంబలగూడెం, టెంపుల్‌కాలనీ, మేదర్‌కాలనీ, ఉల్లింగిపాలెం, జలాల్‌పేట, సర్కిల్‌పేట, ఫత్తుల్లాబాద్, జవ్వారుపేట, ముస్తాఖాన్‌పేట, ఇనుగుదురుపేట, ఎన్జీవో కాలనీ, విశ్వబ్రాహ్మణ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎల్ఐసీ కాలనీ, దిమ్మల సెంటర్, భాస్కరపురం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఇంటింటికీ డస్ట్‌బిన్లు



పులిగడ్డ(అవనిగడ్డ): పులిగడ్డలో సర్పంచ్ దాసరి విజయకుమార్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు ఇంటింటికీ డస్ట్‌బిన్లను అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచితే అనారోగ్యం బారిన పడకుండా రక్షించుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సెక్రటరీ రమాకుమారి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

105 మందికి వైద్యపరీక్షలు

బంటుమిల్లి: స్థానిక కాంతి కేంద్రం సేవా ట్రస్ట్ భవనంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరంలో 105 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గుడివాడ ప్రభుత్వ గురురాజు హోమియో వైద్యశాల వైద్యులు టి. లక్ష్మి పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. జూనియర్ వైద్యులు హరిచందన, మిస్సీ, సనలు రోగులకు పరీక్షలు చేశారు. లాబ్ టెక్నీషియన్ గోపి షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు చేశారు. శిబిరంలో కేంద్రం నిర్వాహకుడు జె. వాసుదేవరావు, సభ్యులు రమణ, ఎస్.రేవతి సేవలందించారు.

రేపు కంటి వైద్యశిబిరం

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, పెదకాకాని శంకర కంటి ఆస్పత్రి సహకారంతో స్థానిక సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షుడు తలశిల రఘుశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాగాయలంకలోని మారుతీ కాన్వెంట్ ఆవరణలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్షలు చేస్తారని పేర్కొన్నారు. శుక్లాలు ఉన్న వారికి కంటి లోపల అద్దాలు అమర్చే ఆపరేషన్లు (ఐఓఎల్) శంకర కంటి ఆస్పత్రిలో ఉచితంగా చేయిస్తామని శేఖర్ పేర్కొన్నారు.

నేడు ఘంటసాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

ఘంటసాల: ఘంటసాల మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మారుతీశేషమాంబ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వేమూరి రజనీకుమారి అధ్యక్షతన జరిగే సమావేశానికి మండలంలోని ఆయా శాఖలకు సంబంధించి పూర్తి వివరాలతో పాల్గొనాలని, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ఉద్యోగులూ సమస్యలు విన్నవించండి

మచిలీపట్నంటౌన్: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి ఈ నెల 27వ తేదీ శనివారం ఏపీ షెడ్యూల్డ్ క్యాస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నాగిశెట్టి ధర్మయ్య మచిలీ పట్నం విచ్చేస్తున్నారని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కర్రా సునీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎంఅండ్‌హెచ్‌వో, ఆర్ అండ్‌బీ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, సాంఘిక సంక్షేమశాఖలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల రూల్ ఆఫ్ రిజర్వేషన్స్, రోస్టర్ వివరాలను పరిశీలిస్తారని పేర్కొన్నారు.

నేడు హంసలదీవిలో చెరువుల లీజు వేలం

కోడూరు: హంసలదీవి పంచాయతీ పరిధిలోని చెరువులకు శనివారం లీజు వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. హంసలదీవి, పాలకాయతిప్పలోని నాలుగు చెరువులకు వేలంపాటలు ఉంటాయన్నారు. ఉదయం 11గంటలకు పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే పాటలో ఆసక్తిగల రైతులు పాల్గొనాలని కోరారు.

లాభదాయకం

ఆయిల్‌పామ్ సాగు

- వ్యయం తక్కువ.. ఆదాయం అధికం
- దళారుల బెడద లేదు.. కేంద్రం ధర నిర్ణయిస్తుంది
- సాగుపై అవగాహన కార్యక్రమాలు

బొబ్బర్లంక(మోపిదేవి): ఏటా సంప్రదాయ పంటల సాగుతో నష్టాలు చవిచూస్తూ అప్పుల పాలవుతున్న రైతులు ఆయిల్‌పామ్‌పై దృష్టి సారించారు. సాగు లాభదాయకంగా ఉండటంతో ఆదాయవనరుగా మారింది. ప్రజల అవసరాలకు తగినంతగా ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్‌లో నూనెలకు డిమాండ్ ఏర్పడింది. ఆయిల్‌పామ్ సాగు ఒక్కసారి చేపడితే సుమారు 30 ఏళ్ల పాటు ప్రతి నెలా ఆదాయం అందుకోవచ్చు. ఈ సాగుతో ఆ కుటుంబం మొత్తానికి మంచి ఆదాయం సమకూరే అవకాశం ఉంటుంది.

సబ్సిడీ రూపంలో ప్రోత్సాహం

కేంద్ర ప్రభుత్వం కూడా సబ్సిడీ రూపంలో ఆయిల్‌పామ్ సాగుకు ప్రోత్సహిస్తోంది. రైతులు ఆ సాగుపై ఆలోచన చేయాలని ఉద్యానశాఖ అధికారులు సూచిస్తున్నారు. నియోజకవర్గంలో 16 ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగు చేపట్టారు. అందులో భాగంగా మోపిదేవి మండలంలోని బొబ్బర్లంకలో రైతు కోనేరు శివలీల ప్రసాద్ రెండు ఎకరాల్లో ఈ సాగు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన అనుభవాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీపై సాగు ప్రోత్సహిస్తోందని తెలుసుకున్నారు. దీంతో తన భూమిని గత ఫిబ్రవరి నెలలో బాగా దున్నారు. అందులో పశ్చిమగోదావరి జిల్లా



బొబ్బర్లంకలో ఆయిల్‌పామ్ సాగు

నల్లచర్ల నుంచి 'సిరాయిడ్' రకం ఆయిల్‌పామ్ మొక్కలు ఎకరాకు 57 మొక్కలు తెచ్చి నాటినట్లు తెలిపారు.

ప్రతి మొక్కకూ తొమ్మిది మీటర్ల దూరం

ట్రయాంగిల్ రూపంలో ప్రతి మొక్కకూ 9 మీటర్ల దూరం పాటిస్తూ పొలంలో నాటినట్లు చెప్పారు. ఎరువులు ఏడాదికి రెండుసార్లుగా యూరియా, సూపర్‌ఫాస్ఫేట్, పొటాష్ రెండు కట్టల వంతున వేయాల్సి ఉంటుందన్నారు.

మొక్క నాటిన నాలుగు సంవత్సరాల తర్వాత గెలలు(కాయలు) కటింగ్‌కు వస్తాయని, అప్పటి వరకు అంతర పంటగా మినుము, మొక్కజొన్న, అరటి, వాణిజ్య పంటలైన కూరగాయల సాగు అందులో చేయవచ్చని తెలిపారు. సబ్సిడీ రూపంలో ఎకరాకు ప్రభుత్వం రూ. 49 వేలు రైతులకు ఇస్తుందని చెప్పారు.

ప్రతి నెలా ఎకరాకు 15 టన్నుల వంతున దిగుబడి



కాయలు దిగుబడి రావడం ప్రారంభిస్తే ప్రతి నెలా ఎకరాకు కనీసం 15 టన్నుల వంతున దిగుబడి ఇస్తుంది. అలా 30 ఏళ్ల పాటు దిగుబడి ఇస్తూనే ఉంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో కంపెనీవారే రైతు దగ్గరకు వచ్చి కిలో రూ. 13 వంతున కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం అన్ని పంటలకూ దళారులే ధరలు నిర్ణయించగా, ఆయిల్‌పామ్ సాగులో మాత్రం మార్కెట్ ధరను కేంద్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. డ్రిప్ ఇరిగేషన్‌కు, పలు రకాలు యాంత్రీకరణకు కూడా సబ్సిడీ రూపంలో ప్రభుత్వం సబ్సిడీ అందించి ప్రోత్సహిస్తోంది.

అధికారులు అందుబాటులో ఉండాలి



ఆయిల్ ఫామ్ సాగు ఈ ప్రాంతానికి కొత్తగా ఉంది. ఈ పంట వేసిన రైతులను ప్రోత్సహించేందుకు ఉద్యానశాఖ అధికారులు అందుబాటులో ఉండాలి. కొనుగోలు కేంద్రాలు కూడా అందుబాటులో ఉంచాలి.

–కోనేరు శివలీలప్రసాద్, రైతు, బొబ్బర్లంక

ఆయిల్‌పామ్‌తో లాభాలు



మొక్కల కొనుగోలుపై ప్రభుత్వ రాయితీని హెక్టార్‌కు 143 మొక్కలకు వస్తుంది. దేశవాళీ మొక్కలకు రూ. 20 వేలు, ఇతర దేశాల నుంచి దిగుబడి చేసుకునే వాటికి రూ. 29 వేలు అందిస్తుంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చు. తక్కువ కూలీలతో ఎక్కువ సాగు చేయొచ్చు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాల భయం, పంట నష్ట ప్రమాదం లేదు. దళారీ వ్యవస్థ లేకుండా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పారదర్శకంగా పామాయిల్ గెలల సేకరణ ఉంటుంది. ఏ పంటకూ లేని విధంగా ఈ పంట మార్కెట్ ఒడిదొడుకులు తట్టుకునే విధంగా కేంద్ర ప్రభుత్వం రూ. 11వేల కోట్ల కేటాయించింది. రైతులు స్థిరమైన ధరను పొందడానికి వయబిలిటీగేప్ ఫండ్ ద్వారా అందుతుంది.

– ఎస్.రమేష్, ఉద్యానశాఖ అధికారి, అవనిగడ్డ

చేనేత పితామహుడు ప్రగడ



ఘంటసాలలో చేనేత సీనియర్ కార్మికనేత మునగాల సుబ్బారావును సత్కరిస్తున్న దృశ్యం

ఘంటసాల: కార్మికుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేసి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన చేనేత పితామహుడు ప్రగడ కోటయ్యను ఆదర్శంగా తీసుకుని ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని చేనేత సీనియర్ కార్మికనేత మునగాల సుబ్బారావు అన్నారు. ఘంటసాల నందం బజార్‌లోని భావనా ఋషి కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో ప్రగడ కోటయ్య 109వ జయంతి వేడుకలు మునగాల సుబ్బారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రగడ కోటయ్య విగ్రహానికి వార్డు సభ్యురాలు నందం సుజాత, చేనేత మహిళలతో పాటు సుబ్బారావు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మునగాల సుబ్బారావును వైఎస్సార్ సీపీ సేవాదళ్ మండల అధ్యక్షులు దిరిశం పిచ్చేశ్వరరావు ఆధ్వర్యంలో చేనేత కార్మికులు, మహిళలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నందం వెంకట నరసింహం, నందం భార్గవరావు, దిరిశం శ్రీను, మాచర్ల మస్తాన్, గుత్తికొండ శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఘంటసాల పంచాయతీ ప్రాంగణంలో జరిగిన ప్రగడ కోటయ్య జయంతి వేడుకలను కోస్తాంధ్ర పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి అందె జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

ఆధార్ క్యాంపులు వినియోగించుకోండి

కొడాలి(ఘంటసాల): ఘంటసాల మండలం కొడాలి గ్రామసచివాలయం వద్ద శుక్రవారం జరుగుతున్న ఆధార్ క్యాంపును ఎంపీడీవో మారుతీ శేషమాంబ పరిశీలించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఏవో శ్రీనివాస్‌చంద్, ఈవో నాగమణి, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కృత్తివెన్ను: సీతనపల్లి సచివాలయం వద్ద ఆధార్‌కేంద్రాన్ని కృత్తివెన్ను ఎంపీడీఓ రామకృష్ణరాజు పరిశీలించారు.

బంటుమిల్లి: మండల పరిధిలోని బంటుమిల్లి-1, 2, ముంజులూరు గ్రామ సచివాలయాల్లో శనివారం ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణరాజు కోరారు.

నేడు ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

గోగినేనిపాలెం(ఘంటసాల): ఉమ్మడి కృష్ణా జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం ఆధ్వర్యాన ఘంటసాల మండలం గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో శనివారం జరిగే ఉమ్మడి కృష్ణాజిల్లా స్థాయి జూనియర్, సీనియర్ బాల బాలికల సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు తమ్మన వేణుగోపాలరావు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ జూనియర్ బాలబాలికలు, సీనియర్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక పోటీలు శనివారం ఉదయం ప్రారంభమవుతాయన్నారు. పాఠశాల పీడీ గరికపాటి మారుతి ఆధ్వర్యంలో జరిగే జట్ల ఎంపికకు సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు పాల్గొనాలని హెచ్‌ఎం కోరారు.

మడ అడవులతో ఉపయోగాలెన్నో



వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: మడ అడవులతో ఎన్నో ఉపయోగాలున్నాయని మచిలీపట్నం అటవీ క్షేత్రాధికారి సుజాత అన్నారు. అంతర్జాతీయ మడ అడవుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం గిలకలదిండిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మడ అడవుల ప్రాముఖ్యం, ఉపయోగాలను వివరిస్తూ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. మడ అడవుల ఉపయోగంపై హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి ప్రతిభచూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జిల్లా అటవీశాఖాధికారి రాజశేఖరరావు ఆదేశాలతో కార్యక్రమాన్ని నిర్వహించామని సుజాత తెలిపారు. అటవీశాఖాధికారులు షరీఫ్, వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శర్వాణీ.. శాకంబరీ..



పెడనలో శాకంబరీదేవిగా పైడమ్మ అమ్మవారు



కూరగాయలతో అలంకృతమైన శ్రీభ్రమరాంబదేవి, శ్రీమల్లేశ్వరస్వామి



ఆలయంలో సారె సమర్పణ పూజలు

పెడన: పెడనలోని పలు ఆలయాల్లో అమ్మవారు శాకంబరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. గూడూరు రోడ్డులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి క్షేత్రంలోని వాసవి మాతను మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో 200 కేజీల వివిధ కూరగాయల్లో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్న పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ నాయకులు కొల్లిపర నరసింహారావు, కొల్లూరి రాజా, జవాజి నాగు మహిళా మండలి గౌరవ అధ్యక్షురాలు కొమ్మూరి సుధారాణి, అధ్యక్షురాలు తమ్మన లక్ష్మీ తాయారు పాల్గొన్నారు. ఒకటో వార్డులోని గ్రామ దేవత శ్రీపైడమ్మ అమ్మవారిని శుక్రవారం శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ ఈవో తిక్కిశెట్టి వీర వెంకట మోహన్ రావు, వంశపారపర్య ధర్మకర్త దాసు వాయునందనరావు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో కొలువు దీరిన శ్రీ కనకదుర్గమ్మను భక్తులు వివిధ రకాల కూరగాయలతో అలంకరించారు.

అన్నపూర్ణాదేవికి సారె సమర్పణ

భావదేవరపల్లి(నాగాయలంక): ఆషాఢ మాసం పురస్కరించుకుని గ్రామంలోని శ్రీఅన్నపూర్ణాదేవి సమేత శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆషాఢ సారె వేడుక పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారి విగ్రహదాత అర్జా ఉదయభాస్కరరావు, నాగలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ఆషాఢ సారె కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు వారికి సాదర స్వాగతం పలికారు.

టి.కొత్తపాలెం(నాగాయలంక): గ్రామంలోని పురాతనమైన శ్రీభ్రమరాంబ సమేత శ్రీమల్లేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం గ్రామస్తులు, భక్త సమాజాలు, భజన బృందాల ఆధ్వర్యంలో అమ్మవారికి శాకంబరీ పూజలు వైభవంగా నిర్వహించారు. అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీభ్రమరాంబ, శ్రీమల్లేశ్వరస్వామి మూల విరాట్‌లకు 54కిలోల కూరగాయలు, ఆకుకూరలతో అలంకార శోభను చేకూర్చారు.

హెల్మెట్ ధరించండి.. ప్రాణాలు కాపాడుకోండి



పెడనలో జరిగిన ర్యాలీలో న్యాయమూర్తి రామకృష్ణయ్య తదితరులు

పెడన: ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లాన్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య చెప్పారు. పెడనలోని శ్రీవిజయానంద డిగ్రీ కళాశాల నుంచి పెడన బస్టాండ్ సెంటర్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తిరిగి కళాశాలకు చేరిన తర్వాత న్యాయమూర్తి రామకృష్ణయ్య మాట్లాడారు. రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలతో రోడ్డు ప్రమాదాల నివారణపై రాష్ట్ర వ్యాప్తంగా వాహనచోదకులు, వారి కుటుంబసభ్యులను అప్రమత్తం చేసేలా చైతన్యపరచడం, అవగాహన సదస్సులు నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. ఇంట్లో నుంచి ద్విచక్ర వాహనచోదకులు బయటకు వెళ్తుంటే హెల్మెట్ తీసి వారికి అందజేయాల్సిన బాధ్యత కుటుంబ సభ్యులపై ఉందన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ ధరించకపోతే జరిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. మాదకద్రవ్యాలకు దూరంగా విద్యార్థులుండాలని, భవిష్యత్తుకు బంగరుబాట వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెడన తహసీల్దార్ ఆర్.రాంబాబు, మున్సిపల్ కమిషనర్ బి.వెంకటరామయ్య, కృత్తివెన్ను బంటుమిల్లి ఎస్ఐలు నాగరాజు, వాసు, కళాశాల ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరరావు, ఆర్ఐ మణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైనికుల పోరాట పటిమ స్ఫూర్తిదాయకం



వీర జవాన్ల సత్కారంలో వీసీ శ్రీనివాస్



గూడూరు జెడ్పీ హైస్కూల్లో మొక్కలు నాటుతున్న ఎన్‌సీసీ కేడెట్లు

కోనేరుసెంటర్: దేశ రక్షణతో పాటు ప్రజల ప్రాణాలను కాపాడటంలో భారత సైనికుల పోరాట పటిమ ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య శ్రీనివాస్ కొనియాడారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న పలువురు జవాన్లను శుక్రవారం విశ్వవిద్యాలయంలో భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఉప కులపతి శ్రీనివాస్ మాట్లాడుతూ మనమంతా స్వేచ్ఛగా బతుకున్నామంటే జవానులే కారణమన్నారు.

కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకుడు కొనకళ్ల జగన్నాథం (బుల్లయ్య), జనసేన నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ, యువమోర్చా జిల్లా అధ్యక్షుడు నాగలింగం అయోధ్య రామచంద్రరావు, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాల రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు: గూడూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 16 ఏపీ ఎన్‌సీసీ బెటాలియన్ ఆధ్వర్యంలో 307 ట్రూప్ గూడూరు హైస్కూల్ కేడెట్లు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని డి.పుష్పలత, ఎన్‌సీసీ అధికారులు హవల్దార్ జితేందర్, సుబేదార్ ముస్తాక్ హుస్సేన్, పీడీ మత్తి అరున తదితరులు పాల్గొన్నారు.

కృత్తివెన్ను: మండల పరిధిలోని పల్లెపాలెం ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను జరుపుకున్నారు. కార్గిల్ యుద్ధంలో సైనికుల ధైర్యసాహసాలను, వారి త్యాగాలను ఉపాధ్యాయుడు సూర్యప్రకాష్ విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయ్‌కుమార్, రాజ్యలక్ష్మి, ఏసుబాబు, జి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో మేలైన దిగుబడులు



కంకటావలో జరిగిన పొలంబడిలో సూచనలు ఇస్తున్న శ్రీనివాస్

గూడూరు: రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించి మేలైన దిగుబడులు సాధించాలని జిల్లా వ్యవసాయ వనరుల విభాగం సహాయ సంచాలకుడు శ్రీనివాస్ అన్నారు. గూడూరు మండలం కంకటావలోని తోట విష్ణుమూర్తి వ్యవసాయ క్షేత్రంలో శుక్రవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయ విధానంలో వరిసాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. దీంతో నాణ్యమైన పంటలను పండించి మార్కెట్‌లో రైతుకు మంచి రేటు అందించాలన్నది ప్రభుత్వ లక్ష్యన్నారు. 14 వారాలపాటు నిర్వహించే జీఏపీ పొలంబడి కార్యక్రమాన్ని కంకటావను ఎంపిక చేసినట్లు గూడూరు మండల వ్యవసాయ శాఖ అధికారి జి.వి.శివప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో రైతులు తోట పోతురాజు, తాతా వెంకట బసవమ్మ, వాకా శ్రీనివాస్, వెంకట్, వీఏఏలు పాల్గొన్నారు.

పరిశుభ్రతతో డెంగీని తరిమేద్దాం

పెడన మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య తదితరులు

పెడన: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డెంగీ వంటి వ్యాధులను తరిమేద్దామని మున్సిపల్ కమిషనర్ వెంకటరామయ్య పిలుపునిచ్చారు. జోగానందరావు కాలనీలో ఫ్రైడే.. డ్రైడే సందర్భంగా శుక్రవారం మున్సిపల్ సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్, టీడీపీ వార్డ్ ఇన్‌చార్జి ఇజ్రాయిల్ తదితరులతో కలిసి స్థానికులకు దోమల కారణంగా వ్యాపించే వ్యాధులపై అవగాహన కల్పించారు. సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయం సిబ్బంది, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ

పామర్రు: లయన్స్ క్లబ్ ఆఫ్ పామర్రు వారి సౌజన్యంతో చిరు వ్యాపారులకు శుక్రవారం గొడుగులను పంపిణీ చేశారు. రోడ్ల వెంబడి చిరు వ్యాపారాలు చేసుకునే వారికి వీటిని ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో పామర్రు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నవులూరి వీర వెంకయ్య, కార్యదర్శి మధుసూదనరావు, కోశాధికారి గడ్డాడ విక్టర్ పాల్, సభ్యులు బైసాని నాగేశ్వరరావు, తోట రమేష్, లంకపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.